

# మేడారం సక్సెస్‌లో ఆయనే ఐ(కే)కాన్



- కోట్లలో భక్తులు...అలుపెరగని విధులు
- జబర్దస్త్ గా మేడారం బందోబస్తు
- ప్రణాళిక బద్ధంగా పటిష్ట రక్షణ చర్యలు
- ప్రమాదాలకు దూరంగా.. ప్రాణ నష్టం లేకుండా
- బలమైన నిఘాతో భక్తులకు భరోసా
- అవాంఛనీయ సంఘటనలకు దూరంగా జాతర నిర్వహణ
- ఏఐ టెక్నాలజీ... డ్రోన్ కెమెరా లు.. నిఘా నేత్రాలు
- గతానికి భిన్నంగా బలమైన నిఘా వ్యవస్థ
- పసిపిల్లల రక్షణ పై ప్రత్యేక దృష్టి
- మేడారంలో ములుగు
  ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కే కాన్ "మార్క్ "





**డిడి9 వార్త,ములుగు బ్యూరో:** ఆసియా ఖండంలోనే అతి పెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం శ్రీ సమ్మక్క-సారలమ్మ మహా జాతర విజయవంతంగా ముగిసింది. ఈ మహాజాతర సక్సెస్‌లో ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ ఆర్.కే. కేకాన్ కీలక పాత్ర పోషించారు. సుమారు 45 రోజుల పాటు అలుపెరుగకుండా జాతర నిర్వహణపై అహర్నిశలు కృషి చేసి, కోట్లాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈసారి జాతరకు 1 కోటి 50 లక్షలకుపైగా భక్తులు తరలివచ్చినా, గతంతో పోలిస్తే ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గడం పోలీసు శాఖ ప్రణాళికకు నిదర్శనం. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి పోలీసులు వినూత్న ఆలోచనలతో ప్రత్యేక రూట్ మ్యాప్‌లు అమలు చేసి జాతరను సజావుగా నిర్వహించారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఎంట్రీ-ఎగ్జిట్ మార్గాలను ప్రత్యేకంగా రూపొందించారు. వాహనాల నిలుపుదల కోసం విస్తృతంగా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. మేడారం జాతరలో పోలీసులు ఈసారి 450 సీసీ కెమెరాలు, 20 రకాల డ్రోన్ కెమెరాలను వినియోగించారు. ప్రత్యేకత ఏమిటంటే ఇవన్నీ ఏఐ టెక్నాలజీ ఆధారంగా పనిచేయడం. ట్రాఫిక్ ఇబ్బందులు లేదా అవాంఛనీయ ఘటనలు జరిగితే వెంటనే డ్రోన్ ద్వారా అక్కడి పరిస్థితిని పరిశీలించి పోలీసు బృందాలు స్పందించాయి. జాతరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి కూడా లక్షలాది భక్తులు తరలివచ్చారు. వారి కోసం పోలీసులు నాలుగు ఎంట్రీ రహదారులు, నాలుగు ఎగ్జిట్ రహదారులు ఏర్పాటు చేశారు. భక్తుల వాహనాల నిలుపుదల కోసం సుమారు 20 వేల ఎకరాల్లో మొత్తం 38 పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయడం జరిగింది.

కోట్లాది మంది భక్తులు, లక్షల వాహనాలు వచ్చినా ఈసారి ప్రాణనష్టం జరగలేదు. తొక్కిసలాట వంటి ఘటనలు సంభవించకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించారు. నూతనంగా నిర్మించిన సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద సుమారు 30 లక్షల మంది చిన్నపిల్లలు, వృద్ధులు దర్శనం చేసుకున్నప్పటికీ



ఎలాంటి ప్రమాదాలు జరగలేదు. ఈసారి ప్రత్యేకంగా తప్పిపోయిన పిల్లలను గుర్తించేందుకు క్యూఆర్ కోడ్ బాండ్ విధానం అమలు చేశారు. పిల్లల వివరాలు, తల్లిదండ్రుల ఫోన్ నెంబర్లతో బాండ్ తయారు చేసి వారి చేతికి అమర్చారు. తప్పిపోయిన పిల్లలను డ్రోన్, స్కానింగ్ ద్వారా గుర్తించి కుటుంబాలకు అప్పగించడం అభినందనీయం. గట్టమ్మ దేవాలయం వద్ద 20 ఎకరాల్లో ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ జామ్ సమస్య తగ్గింది. రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలు జరగకుండా ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయడం కూడా భక్తులకు ఎంతో ఉపయుక్తంగా మారింది. మేడారం జాతరలో సమర్థవంతంగా విధులు నిర్వహించిన పోలీసు అధికారులను, సిబ్బందిని తెలంగాణ రాష్ట్ర డిజిపి ప్రత్యేకంగా అభినందించారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా తీసుకున్న చర్యలను కొనియాడారు. మేడారం జాతరలో 13,000 మంది పోలీసులు విధి నిర్వహణ చేశారు. 20 మంది ఐపీఎస్‌లు, 30 మంది ఏఎస్పీలు, 90 మంది డీఎస్పీలు, 400 మంది సీఐలు, 600 మంది ఎస్ఐలు, మహిళా పోలీసులతో పాటు హోంగార్డులు కూడా బందోబస్తులో పాల్గొన్నారు. ములుగు ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ మాట్లాడుతూ జాతర విజయవంతానికి సహకరించిన పోలీసు అధికారులు, సిబ్బంది, మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర్, పాత్రికేయులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. తన ఆదేశాలను పాటిస్తూ కంటిమీద కునుకు లేకుండా విధులు నిర్వర్తించిన పోలీసులకు తాను రుణపడి ఉంటానని పేర్కొన్నారు.

